# ప్రజాపక్షం

PRAJAPAKSHAM

స్తంభాద్రి భద్రాద్రి

బుధవారం | 24 | ఏప్రిల్ | 2024

పేజీలు 8


## ఐదో రోజు 11 నామినేషన్లు



### ఎనిమిది మంది అభ్యర్థులు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పార్లమెంటు ఎన్నికల నామినేషన్ ఘట్టంలో భాగంగా ఐదవ రోజు ఎనిమిది మంది అభ్యర్థులు 11 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. రామసహాయం సురేందర్ రెడ్డి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగారెండు సెట్ల నామినేషన్లను ఆయన పక్షాన కాంగ్రెస్ నేతలు దాఖలు చేశారు. సోషలిస్టు పార్టీ ఇండియా అభ్యర్థిగా

మిగతా 2లో..

# కంచికి చేరని కాంగ్రెస్ కథ



- -అభ్యర్థి ఎంపికపై వీడని ఉత్కంఠ
- -రఘురాంరెడ్డి తరుపున నామినేషన్ దాఖలు
- -రేపు మరి కొందరు వేస్తారన్న ప్రచారం
- -బీఫాం దక్కేదెవరికి...?

**ప్రజాపక్షం/ ఖమ్మం :** నామినేషన్ల ప్రక్రియకు మరో రోజు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక కథ కంచికి చేరలేదు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు మారిన సీన్ ఇప్పుడు ఢిల్లీకి చేరిందన్న ప్రచారం జరుగుతుంది. ముగ్గురు మంత్రులు ఉన్న జిల్లాలో ఇద్దరు మంత్రుల మధ్య అభ్యర్థి విషయంలో ఏర్పడిన బేధాభిప్రాయాలు ఈ ఆలస్యానికి కారణమవుతుందన్న ప్రచారం జరుగుతుంది. కుటుంబ సభ్యులతో మొదలైన వ్యవహారం ఇప్పుడు పలు మలుపులు తిరుగుతుంది. పలు దఫాలుగా కాంగ్రెస్ ఎన్నికల కమిటీ, సిడబ్ల్యూసి సమావేశమైన అభ్యర్థి విషయంలో ఓ నిర్ణయానికి రాలేకపోయారు. రెండు రోజుల క్రితం ఖమ్మం సీన్ బెంగళూరుకు మారింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బెంగళూరుకు పిలిపించడంతో పాటు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయాన్ని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే అడిగి తెలుసుకున్నారు. అయినా ఏకాభిప్రాయం రాలేదు. ఖమ్మం అభ్యర్థి ఎంపిక వ్యవహారం ఇప్పుడు ఢీల్లీకి చేరింది. మొత్తం 17 స్థానాలకు గాను 14 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ ఖమ్మం పై ఏర్పడిన ప్రతిష్టంభనను తొలగించలేకపోతుంది. అభ్యర్థి ఎంపిక వ్యవహారం ఇలా ఉండగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వియ్యంకుడు కాంగ్రెస్ నేత, మాజీ ఎంపి రామసహాయం సురేందర్‌రెడ్డి తనయుడు రఘురాంరెడ్డి తరుపున పొంగులేటి వర్గీయులు కొందరు రెండు సెట్ల నామినేషన్లను వేర్వేరుగా దాఖలు చేశారు. పొంగులేటి వియ్యంకుడైనా రఘురాంరెడ్డి కే టికెట్ ఖరారు అవుతుందని అందుకే కాంగ్రెస్ అభ్యర్థిగానే నామినేషన్ దాఖలు చేశారని



భావిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ నేత ఎంపి టికెట్ ఆది నుంచి బలంగా ఆశిస్తున్న రాయల నాగేశ్వరరావు సైతం ముహూర్తం నిర్ణయించి తాను బుధవారం నామినేషన్ వేస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో మళ్లీ ఉత్కంఠ నెలకొంది. నామినేషన్ల దాఖలుకు బుధ, గురువారాలే చివరి రోజులు కావడంతో అభ్యర్థి బుధవారం వెల్లడయ్యే అవకాశం ఉందని తెలుస్తుంది. సామాజిక సమీకరణలు, మంత్రుల అభిప్రాయాలు వీటన్నింటి నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం తీసుకునే నిర్ణయం ఎవరికి సానుకూలంగా ఉండనున్నది, ఎవరికి ఆశనిపాతంలా తగలనుంది అన్నది తేలాల్సి ఉంది.

## తరలిన ఇసుక ఎంత..?



- -లెక్కలెక్కడ
- -బినామీ కాంట్రాక్టర్‌తో టిఎస్ ఎండిసి అధికారుల మిలాఖత్
- -యధాశక్తి సహకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది
- -గోదావరి గర్భంలో పరుగులు పెడుతున్న యంత్రాలు

**ప్రజాపక్షం/ చర్ల :** ప్రకృతి సంపద కొందరి పరమవుతుంది. అవినీతి అధికారుల మిలాఖత్ ప్రభుత్వ ఆదాయానికి కోట్లాది రూపాయల మేర గండికొడుతుంది. గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు వత్తాసు పలికిందన్న ఆరోపణలు వినవచ్చాయి. కానీ అవినీతికి అలవాటు పడిన అధికారులు ఉండడంతో ప్రభుత్వం మారినా అవినీతి ఆగలేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. గోదావరి ఇసుక ఎంత మేర తరలించారన్న దానిపై టిఎస్ఎండిసి వద్ద లెక్కలే లేవంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఎద్దు ఈనిందంటే గాటికి కట్టేయ్యమన్నట్లుగా ఉంది ఆ శాఖ పనితీరు. చర్ల మండలం పెద్దిపల్లి ఇసుక ర్యాంపు నుంచి ఎంత ఇసుక తరలించారు అని టిఎస్ఎండిసి అధికారులను ప్రశ్నిస్తే అందుకు సంబంధించిన రికార్డులే లేవని క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి సమాధానం వినిపిస్తుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నది గర్భం నుంచి మానవ శ్రమతో ట్రాక్టర్ల ద్వారా అధికార యంత్రాంగం నిర్ణయించిన లోతులో ఇసుకను తరలించాల్సి ఉంది. కానీ బహిరంగంగా యంత్రాలను నది గర్భంలోకి దింపి ఇసుకను తరలిస్తున్నారు. గోదావరి నుంచి డంపింగ్ యార్డుకు తరలించిన

మిగతా 2లో..

## ప్రభావిత ప్రాంతాల్లో కూనంనేని విస్తృత పర్యటన



2లో

## కరకట్ట నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల



2లో

# ప్రభావిత ప్రాంతాల్లో కూనంనేని విస్తృత పర్యటన

**-పునరుద్దరణ పనులు సత్వరమే పూర్తి చేయాలి**
**-ఇండ్లు కోల్పోయిన పేదలకు పరిహారంతోపాటు పక్కా గృహాలు మంజూరు చేయాలి**
**-పంట నష్టంపై సర్వే చేపట్టి ప్రభుత్వానికి నివేదిక అందించాలి**
**-కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని**



**ప్రజాపక్షం/కొత్తగూడెం** : కొత్తగూడెం పట్టణం పరిధిలోని వర్ష ప్రాభావిత ప్రాంతాల్లో స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివ రావు రెండో రోజైన మంగళవారం విస్తృతంగా పర్యటించారు. గాజుల రాజం బస్తి, బూడిదగడ్డ, కూలీలైన్, హనుమాన్ బస్తిల్లో ఈదురుగా లలు, వడగండ్ల వానతో దెబ్బ తిన్న ఇండ్లను పరిశీలించి జరిగిన నష్టాన్ని బాదితులను అడిగి తెలుసుకున్నారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ శాఖ చేపట్టిన విద్యుత్ స్తంబాలు, విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులను పరిశీలిం చారు. నిర్విరామంగా పనులు కొనసాగించి విద్యుత్ సరఫరాను సత్వ రమే పునరుద్దరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఇటీవల కురిసిన వడగండ్ల వాన, ఈదురుగాలులతో తీవ్ర నష్టం వాటిల్లిందని, పేదల ఇండ్లు, గుడిసెలు నెలమట్టమై నిరాశ్రయులుగా మారారని, వీరికి పున రావాసం కల్పించడంతోపాటు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇండ్లు కోల్పోయిన పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ గృహాల మంజూరులో తొలి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గాజులరాజం బస్తిలో ఇంటి రేకు మీదపడి గాయాలపాలైన దేవమ్మను పరామర్శిం చారు. జిల్లా వ్యాప్తంగా 278 విద్యుత్ స్తంబాలు కూలిపోయాయని, 48 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతున్నాయని అధికారులు ప్రకటించారని, వీటి పున రుద్దరణ దాదాపుగా పూర్తికావచ్చిందని తెలిపారు. మంగళవారం సాయంత్రంలోపు సాధారణ పరిస్థితులకు తీసుకొచ్చే విధంగా విద్యుత్ శాఖ శ్రమించాలని కోరారు. ఈదురుగాలులతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారని, అదేవిదంగా దాల్వ వరి సాగుచేసిన రైతులకు నష్టంవాటిల్లిందని, ఈ నష్టంపై వ్యవసాయ శాఖ అధికారులు సర్వే చేపట్టి జరిగిన నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందించడం ద్వారా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించే విధంగా కృషి చేయా లన్నారు. రోడ్లుపై విరిగిపడిన చెట్లను తొలగించి రవాణాను సులబతరం చేయడంతోపాటు పారిశుద్యాన్ని మెరుగుపర్చాలని మున్సిపల్ అధికా రులను ఆదేశించారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా ఉన్నారు.

# ఐదో రోజు 11 నామినేషన్లు

(మొదటిపేజీ తరువాయి)
రైస్ అన్వర్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా ఆనందప్రసాద్, స్వతంత్ర అభ్యర్థులుగా కటకోజ్వల నాగేశ్వరరావు, ఔతపల్లి రాంబాబు, కాసిమళ్ల నాగేశ్వరరావు, షేక్ సిరాజుద్దీన్ నామినేషన్లను దాఖలు చేశారు. భారతీయ జనతా పార్టీ అభ్యర్థి తాండ్ర వినోదరావు బిఫాం తో మంగళవారం మరో రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్లకు మరో రెండు రోజుల మాత్రమే సమయం ఉండగా ఇప్పటి వరకు 17 మంది అభ్యర్థులు, 26 నామినేషన్ సెట్లు దాఖలయ్యాయి.

## కరకట్ట నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/భద్రాచలం** : కరకట్ట పొడిగింపు నిర్మాణ పనులను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. రానున్న వర్షాకాలం లోపు పనులు పూర్తి చేసి వరద నీరు పట్టణంలోనికి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాల న్నారు. పనులు యుద్ధప్రాతిపదికన చేయాలని, పనుల్లో అలసత్వం వహిస్తే కుదరదన్నారు. అనంతరం మ్యాపును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇదిలా ఉండగా భద్రాచలం అభివృ ద్ధిలో తనదంటు ముద్ర వేసే తుమ్మల కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రిగా మరో సారి కరకట్ట పనులను పరిశీలించారు. మంత్రివెంట ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు, రాష్ట్రఅ టవీ అభివృద్ధిసంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, మాజీ కేంద్ర సహాయ మంత్రి, కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి పోరిక బలరాం నాయక్, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మీ నారాయణ, దుర్గాప్రసాద్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యాత్ర చేపట్టడం అభినందనీయం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్** : ప్రజాస్వామ్య పటిష్టతకు ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు వేసేలా ఓటర్లలో చైతన్యం కొరకు జిల్లా వ్యాప్త యాత్ర చేపట్టడం అభినందనీయమని ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి , కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద ఓటరు చైతన్యం కొరకు కల్లూరు మండలం, చెన్నూరు మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు డి. సుధాకర్‌రావు చేపట్టిన చైతన్య యాత్రను కలెక్టర్ ప్రారంభించారు. ఓటు ప్రాముఖ్యత, ఓటరుగా బాధ్యత, స్వేచ్ఛ, న్యాయబద్ద ఎన్నికల అంశా లుగా రూపొందించిన పాటలతో ఓటర్లలో అవగాహన చైతన్యం కలగాలన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరులు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రం సింగ్, ముఖ్య ప్రణాళికాధికారి ఎ. శ్రీనివాస్, జిల్లా ఉపాధి కల్పనాధికారి కె. శ్రీరాం, జిల్లా పౌర సంబంధాల అధికారి ఎంఏ గౌస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తరలిన ఇసుక ఎంత..?

(మొదటిపేజీ తరువాయి)
ఇసుక ఎంత...? యార్డు నుంచి బయటకు తరలి పోయిన ఇసుక ఎంత అన్న దానిపై లెక్కలు లేవు.

**బినామీ కాంట్రాక్టర్‌తో మిలాఖత్ ...**

పెద్దిపల్లి ఇసుక ర్యాంపు బినామీ కాంట్రాక్టర్ మాటలు చర్ల మండల పరి ధిలోని రెవెన్యూ, పోలీస్ అధికారులతో పాటు టిఎస్ ఎండిసి అధికారు లకు వేద వాక్కులా మారాయి. ఆ కాంట్రాక్టర్ అడుగులకు రెవెన్యూ అధికారులు మడుగులొత్తుతున్నారు. ఇప్పటికే ఎవరెవరికి ఎంత ఇచ్చింది , ఏ అధికారికి ఎక్కడ ఇచ్చింది ప్రైవేటు సంభాషణలో చెబు తున్న బినామీ కాంట్రాక్టర్ పైచర్యలు తీసుకుంటే ఎక్కడ తమకు ఇచ్చిన వ్యవహారాన్ని బయట పెడతాడోనని అధికారులు తేలుకుట్టిన దొంగలా వ్యవహరిస్తున్నాడు. అంతా సాఫీగా సాగుతుందిలే అనుకుంటున్న సమ యంలో ఇసుక తరలింపు లెక్కలు అడగడం, నది గర్భంలో యంత్రా లతో తోడుతున్న విషయం బహిర్గతం కావడం, నది నుంచి తరలించిన ఇసుకకు అక్కడి నుంచి విక్రయించినా ఇసుకకు కనీస సంబంధం లేక పోవడం ఇప్పుడు అధికారులకు తలనొప్పిగా మారింది. అయినా అధి కారులు చేష్టలూడిగి చూస్తుండడం తప్ప ఈ బినామీ కాంట్రాక్టర్‌ను ఏమి చేయలేని పరిస్థితి. రెండు రోజుల క్రితం ఓ రెవెన్యూ అధికారి, ఓ పోలీస్ అధికారితో కలిసి కొద్ది సేపు హడావుడి చేశాడు. బినామీ కాంట్రాక్టర్ వచ్చి మాట్లాడగానే అంతా ప్రశాంతమైపోయింది. ఎటు వంటి చర్యలు లేకుండానే కాంట్రాక్టర్ గుసగుసలతో అధికారులు సంతృప్తి పడ్డారన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

**ఉన్నతాధికారులకు ఫిర్యాదు...**

పెద్దిపల్లి ఇసుక ర్యాంపుకు సంబంధించి అక్రమ ఇసుక తరలింపు అధి కారుల సహకారం తదితర విషయాలపై రాష్ట్ర గవర్నర్‌తో పాటు ముఖ్య మంత్రి ఇతర అధికారులకు ప్రకృతి ప్రేమికులు, కొందరు గిరిజనులు ఫిర్యాదు చేశారు. న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించనున్నట్లు సమా చారం. పెద్దిపల్లి ఇసుక ర్యాంపు లో అక్రమాలపై కొన్ని రాజకీయ పార్టీలు సైతం ఆందోళనకు సిద్దమవుతున్నాయి. అవనీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని పెద్దిపల్లి ఇసుక ర్యాంపులో గిరిజన సొసైటీకి న్యాయం చేయాలని ఆందోళనలు నిర్వహించనున్నట్లు సమాచారం.

# బిజెపికి భద్రాద్రి రాముని పై వివక్ష ఎందుకు...?

**-కన్నెత్తి చూడని బిజెపి నేతలు**
**-అయోధ్య రాముడే ఓట్లు వేయిస్తాడా ...!**

**ప్రజాపక్షం/ ఖమ్మం** : పార్లమెంటు ఎన్నికలు ప్రారంభమైన వేళ బిజెపి రామ నామ జాపం చేస్తుంది. పదేళ్ల కాలంలో ఏమి చేశారన్న ప్రశ్నకు అయోధ్యలో రామాలయాన్ని చూపుతున్నారు. అన్నింటికి పరిష్కారం రామాలయ నిర్మాణమే నన్న జవాబు బిజెపి నేతల నుంచి వస్తున్నది. ప్రజల మనోభావాలను పాలకులు గౌరవించాల్సిందే కానీ ఆ మనోభావాలను తమ రాజకీయ ఉన్నతికి వినియోగిం చుకోవడం తప్పిదమన్న భావన బిజెపి నేతల్లో లేదు. రామునిపై అమితమైన ప్రేమ చూపే బిజెపి నేతలు భద్రాద్రి రామునిపై ఎందుకు వివక్ష చూపుతున్నార న్నది అర్థం కావడం లేదు. కేవలం అయోధ్య రాముడే ఓట్లు కురిపిస్తాడా భద్రాద్రి రాముడు ఆ పని చేయలేడా అన్నది ఇప్పుడు తెలంగాణ ప్రజల నుంచి వస్తున్న ప్రశ్న. భద్రాచలం దక్షిణ అయోధ్యగా పేరొందింది. త్రేతాయుగంలో రాముడు భద్రాచలం ప్రాంతంలో నడయాడినట్లు చారిత్రిక ఆధారాలు ఇక్కడ ఉన్నాయి. భద్రాచలం, పర్ణశాల అందరికి తెలిసినవే. నిజాం నవాబుల కాలంలో కంచర్ల గోపన్న (భక్తరామదాసు) రామాలయాన్ని నిర్మించాడని ఇక్కడి చారిత్రిక ఆధారాల ద్వారా తెలుస్తుంది. అటువంటి భద్రాచలాన్ని బిజెపి నేతలు విస్మరిస్తు న్నారు. మోడీ సహా బిజెపి నేతలు ఎవరు భద్రాద్రి రామాలయాన్ని దర్శించుకోవ డానికి రాలేదు. అది వారి వ్యక్తిగతం. కానీ రాముని పేర రాజకీయాలు చేస్తున్న బిజెపి భద్రాచలంలో కనీస సౌకర్యాలను సమకూర్చి రామాలయాన్ని అభివృద్ధి చేసే బాధ్యతను కూడా విస్మరిస్తున్నారు. భద్రాచలం రోడ్డు నుంచి మణుగూరు వెళ్లే రైల్వే లైన్ నుంచి 15 కిలో మీటర్ల దూరం రైల్వే మార్గాన్ని నిర్మిస్తే భద్రాద్రి రామున్ని దర్శించుకునేందుకు రైలు మార్గం ద్వారా సులువవుతుంది. ఇప్పుడు కొత్తగూడెంకు చేరుకుని కొత్తగూడెం నుంచి రోడ్డు మార్గం ద్వారా భద్రాచలం చేరుకోవాల్సి వస్తుంది. భద్రాచలంకు సంబంధించి ఎటువంటి నిధులు కేంద్ర ప్రభుత్వ పరంగా సమకూర్చిన దాఖలాలు లేవు. అన్ని దేవాలయాలకు వర్తించే



విధంగా వచ్చే సాధారణ నిధులే తప్ప ప్రత్యేక గ్రాంట్ లేదు. ఇక మరో చారిత్రక ప్రదేశం పర్ణశాల ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదు. భద్రాచలం సమీపంలోని గిరిజ నులు అమితంగా ప్రేమించే అనేక దేవాలయాలు ఉన్నాయి. వాటి వేటి పట్ల బిజెపికి శ్రద్ద లేదు. పదేళ్ల పాలన తర్వాత బిజెపికి ఈ పని చేశాం మాకు ఓట్లు వేయండి అని చెప్పుకోవడానికి ఒక పథకం లేదు. అమ్మకాలు తప్ప సాధించింది ఏదీ లేదు. దేశంలోని ప్రధాన సంస్థలు, కర్మాగారాలు, ఉత్పత్తి కేంద్రాలను కార్పొరేట్ సంస్థ లకు కట్టబెట్టారు. యేటా రెండు కోట్ల ఉద్యోగాలు అన్న మోడీ నినాదం మతం మాటున మరుగున పడింది. ఉపాధి, ఉద్యోగ రంగాలపై బిజెపి ప్రభుత్వం కనీస దృష్టి సారించ లేదు. అన్నింటికి మించి ఎమర్జెన్సీని మైమరిపించే రీతిలో దేశంలో నిర్బంధం కొనసాగుతుంది. ప్రజాస్వామ్యంలోని నాలుగు మూల స్తంభా (పార్ల మెంటు, కార్యనిర్వహక వర్గం, న్యాయశాఖ, మీడియా)లను గుప్పెట్లో పెట్టుకుని తమ వ్యతిరేకులపై ప్రయోగిస్తుంది. కొన్ని జాతీయ సంస్థలు బిజెపి అనుబంధ సంస్థలుగా మారిపోయాయి. ప్రధానమైన వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరే ట్లకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నది బిజెపి. అందు కోసమే మూడు నల్ల చట్టా లను ప్రజల ముందుకు తీసుకు వచ్చింది. బిజెపి పాలిత రాష్ట్రాలలో దళితులు, మైనార్టీల పై దాడులు పెరుగుతున్నాయి. వీటిని ప్రస్తావించని బిజెపి కేవలం రాముని పేరు ద్వారా మరోసారి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తుంది. ప్రధాన మంత్రిగా పదేళ్లు పనిచేసిన తర్వాత మేము చేసిన అభివృద్ధి ఇది ఆదరిం చండి అని అడగకుండా హనుమాన్ ఆలయాల గురించి, అయోధ్యలో రామా లయ నిర్మాణం గురించి, మతం గురించి మాట్లాడుతున్నారంటే చేసింది ఏమి లేదని కాస్త ఆలోచించే వారికి అవగతమవుతుంది. కానీ మతం మత్తుని తలకు ఎక్కించడంతో పాటు పరమతాన్ని బూసిగా చూపి అధికారాన్ని కైవసం చేసుకో వాలని ప్రయత్నిస్తుంది. ఏ రామున్ని చూపి ఓట్లు అడుగుతున్నారో ఆ రాముని చారిత్రిక ప్రదేశమైన భద్రాచలం రామున్ని ఎందుకు పట్టించుకోవడం లేదన్నది తెలంగాణ ప్రజల ప్రశ్న. తెలంగాణ ప్రజలు ఆలోచించాల్సింది బిజెపికి రాముని పై ఉన్న ప్రేమ కంటే ఓట్ల పైనే మక్కువ. అందుకే భద్రాచలం రాముడు బిజెపి వివక్షకు గురవుతున్నాడు. తెలంగాణ ప్రజలు బిజెపి పట్ల కూడా సరైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. చైతన్యానికి ప్రతీకగా నిలిచిన ఈ గడ్డపై బిజెపి తన జెండాను ఎగుర వేసేందుకు ప్రయత్నిస్తుంది. ఇది అత్యంత ప్రమాదకరం. అందుకే ప్రమాదాన్ని నిరోధించేందుకు లౌకిక శక్తుల బలోపేతానికి కృషి జరగాల్సి ఉంది.

# కార్మిక హక్కుల రక్షణకై పోరాడండి



-ఏఐటియుసి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వాసిరెడ్డి
-మేడే పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల రక్షణకై పోరాడాలని ఏఐటియుసి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయం గిరి ప్రసాద్ భవన్‌లో 138వ మేడే దినోత్సవ గోడ ప్రతులను స్థానిక ఏఐటియుసి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడే అనేది పోరాట స్ఫూర్తికి చిహ్నమని పని గంటల తగ్గింపు కోసం మొదలైన పోరాటం అనేక ఉద్యమ, పోరాట విజయాలను అందించిందన్నారు. భారతదేశంలో మొట్టమొదటి సారి 104 ఏళ్ల చరిత్ర కలిగిన ఏఐటియుసి నేతృత్వంలో కార్మికోద్యమం మొదలైందన్నారు. కమ్యూనిస్టు నేత సింగారవెలిశెట్టి 1923లో ఎర్ర జెండాను ఎగురవేశారని ఆ రోజు నుంచి అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం, కార్మిక హక్కుల రక్షణ కోసం, సాధన కోసం ఎర్ర జెండా నీడన ఏఐటియుసి పోరాడుతుందన్నారు. 180 దేశాలలో నిర్వహించుకునే మేడే ఉత్సవాలు కార్మిక హక్కుల రక్షణ దినోత్సవంగా పాటించాలన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు, నాయకులు రావి శివరామకృష్ణ, ఎండి జాకీరుద్దీన్, పేరబోయిన మోహన్‌రావు, పోటు పూర్ణచందర్‌రావు, మేకల రవి తదితరులు పాల్గొన్నారు.

# రెజొనెన్స్‌లో గ్రాడ్యుయేషన్ వేడుకలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని శ్రీ నగర్ కాలనీలో గల రెజొనెన్స్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం పాఠశాలలో జరిగిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఖమ్మం ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు, పాఠశాల డైరెక్టర్లు కొం డా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణి లు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల కే.జి విద్యార్థులు స్నాతకోత్సవ గౌను తొడుక్కొని తలపై టోపీలు ధరించి పట్టా లు అందుకున్నారు. కిండర్ గ్రాడ్యుయేట్స్ ఆట పాటలతో ప్రాంగణమంతా సందడిగా మారింది. ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు మాట్లాడుతూ కే.జి విద్యార్థుల్లో ఈ గ్రాడ్యుయేషన్ నూతన ఉత్సాహాన్ని కలిగిస్తుందన్నారు. నర్సరీ, ఎల్‌కెజి, యుకేజి తరగతులను పూర్తి చేసుకుని మొదటి తరగతిలోకి అడుగుపెట్టబోతున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. యూనివర్సిటీ స్థాయిలో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ఇస్తున్నట్లుగా కే.జి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ ను ఏర్పాటు చేసి విద్యార్థులకు మరువలేని తీపి జ్ఞాపకంగా ప్రోత్సాహాన్ని అందిస్తున్న పాఠశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం. ప్రసన్నరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ తెలిపారు. మంగళవారం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో పర్యటించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్ సత్తుపల్లి మండలం కిష్టాపురం, సదాశివుని పాలెం, వేంసూరు మండలం కుంచెపర్తి, పెనుబల్లి మండలం గణేశునిపాడు, చింతగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా కేంద్రాలకు వచ్చి మద్దతు ధర పొందాలని ఆయన తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల కోసం నీడ కల్పించడానికి టెంటు, కుర్చీలు, తాగునీటి సౌకర్యం ఏర్పాట్లు తప్పని సరిగా చేయాలని కేంద్ర నిర్వహకులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. కేంద్రాలలో కావాల్సిన



గన్నీ సంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపాలని రైతులకు ధాన్యం డబ్బులు ప్రభుత్వం నుండి వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, పౌర సరఫరాల డిటిలు దర్గయ్య, సత్యనారాయణ, డిఎం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వేసవిలో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిఈవో సోమశేఖర శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాను సారం జిల్లాలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలోని విద్యా సంస్థలకు ఈనెల 24 నుంచి సెలవులు ప్రకటించమని ప్రకటించినట్లు ఆదేశాలు ఇచ్చినట్లు డిఈవో తెలిపారు. నిబంధనల ప్రకారం వేసవి సెలవుల్లో ప్రైవేటు విద్యా సంస్థలు విద్యార్థులకు ఏ రకమైన తరగతులను నిర్వహించరాదని డిఈవో తెలిపారు. అందుకు భిన్నంగా విద్యా సంస్థలు విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తే జీవో నెం. 1 ప్రకారం ఆయా విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. వేసవి తీవ్రత దృష్ట్యా విద్యార్థులను ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు బయటకు వెళ్లనివ్వరాదని వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలలో మరమ్మతులు వివిధ రకాల నిర్మాణ పనులు కొనసాగుతున్నందున సంబంధిత పాఠశాలలు, ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ తెలిపారు.

# గుండెపోటుతో సీతారాంపురం పాస్టర్ మృతి



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని కొండాపురంపంచాయతీపరిధిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుడు,పాస్టర్ పెరుమాళ్ల ప్రేమ్(50) గుండెపోటుతో ఇంటి వద్ద మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు దండ్యాల వెంకటేశ్వరరావు, నాగండ్ల శ్రీనివాస్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నివాళులర్పించిన వారిలో మండల కాంగ్రెస్ యువజ నాయకులు నాగండ్ల భార్గవ్, బొడ్డు ఉపేందర్, ఊదర మహేష్, నాయకులు జమ్మి వీరబాబు, మరికంటి చిన్న ఉప్పలయ్య, చింతమల్ల ధర్మయ్య, కోర్ని వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



డిపో మేనేజర్‌కు ఎంప్లాయీస్ యూనియన్ వినతి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం డిపోలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని టిఎస్ ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ ఖమ్మం డిపో కమిటీ ఆధ్వర్యంలో డిపో మేనేజర్ కు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ ఖమ్మం డిపో కార్యదర్శి బేతంపూడి బుచ్చిబాబు మాట్లాడుతూ డ్రైవర్ చార్ట్ కౌన్సిలింగ్ ను వెంటనే నిర్వహించాలని, బుకింగ్ చార్ట్ నందు స్పేర్‌లో ఉన్న కండక్టర్లకు, డ్రైవర్లకు సీనియార్టీ ప్రకారం డ్యూటీలు వేయాలని కోరారు. క్యాష్ సెక్షన్ నందు ఏడిసిలకు సాఫ్ట్‌వేర్ మారినప్పుడు కంప్యూటర్ ట్రైనింగ్ ఇవ్వాలని, గ్యారేజీ నందు సరైన టూల్స్, మెటీరియల్స్ తెప్పించాలన్నారు. ఏడిసిలకు కౌన్సిలింగ్ నిర్వహించి డ్యూటీలు కేటాయించాలని, మహిళా కార్మికులకు రాత్రి ఎనిమిది గంటల లోపు డ్యూటీలు దిగేలా చూడాలన్నారు. డ్రైవర్, కండక్టర్లకు ప్రతి నెల మూడు రోజుల సెలవును విధిగా ఇవ్వాలని, మహిళా కార్మికులకు వారి ప్రత్యేక అవసరాల నిమిత్తం అడిగిన వెంటనే మూడు రోజులు సెలవులు మంజూరు చేయాలన్నారు. ఆర్టిసి కార్మికులు ఆరోగ్యం బాగాలేక గతంలో లాగే ఆర్టిసి వైద్యుని వద్దకు వెళ్లి సిక్ తీసుకునే పద్ధతిని కొనసాగించాలన్నారు. 2013 పే స్కేల్ ఏరియర్స్ 50 శాతం బాండ్ డబ్బులను వెంటనే కండక్టర్లకు, మెకానిక్‌లకు, ఆఫీస్, సెక్యూరిటీ సిబ్బంది అందరికీ చెల్లించాలన్నారు. డిపో మేనేజర్ కార్యాలయం నందు ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. డిపో మేనేజర్ సూచన మేరకు ఆఫీస్ సూపరింటెండెంట్ జయరాజుకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రీజియన్ ప్రచార కార్యదర్శి జుజ్జుకూరి కిరణ్ కుమార్, ఖమ్మం డిపో కోశాధికారి దామాల లాజర్, డిపో నాయకులు కె. పిచ్చయ్య, ఆర్. దుర్గారావు, ఎండి సలీం తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు రోజుకూలి రూ.600 ఇవ్వాలి



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు రోజు కూలీ రూ.600వందలు చెల్లించాలని ఏఐకేఎంఎస్ (అఖిల భారత ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం) రాష్ట్ర నాయకుడు బందెల వెంకయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఉపాధి కూలీల సమస్యలపై సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎర్రటి ఎండలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు గతంలో వేసవి భత్యం ఇచ్చేవరన్నారు. కానీ ఈ సంవత్సరం ప్రకటించకపోవడంతో కూలీలు ఆందోళన చెందుతున్నారన్నారు. వారం స్లిప్పులు ఇవ్వాలని కూలీలకు వేతనాలు ఇవ్వాడంతో పాటు గడ్డపార,బొచ్చలు, పారలు ప్రభుత్వం సమకూర్చాలన్నారు. పని ప్రదేశంలో టెంట్లు వేయాలని, ఓఆర్‌ఎస్, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అదేవిధంగా మేట్ల ద్వారా మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగా తదితర న్యాయమైన సమస్యను పరిష్కారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు, పాలేరుడివిజన్ అధ్యక్షుడు సోమనపల్లి వెంకటేశ్వర్లు, కందుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఓటర్ల కు ఇబ్బందులు లేకుండా చూడాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య అన్నారు. మండల కేంద్రంలోని పలు వార్డులను పరిశీలించారు. పాఠశాలలను తనిఖీ చేశారు. తాగునీటి వనరులను పరిశీలించారు. మధ్యాహ్నం భోజనం ను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు....ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని అన్నారు. ఉన్న వనరులను వినియోగించుకునేందుకు కార్యచరణ ను రూపొందించినట్లు తెలిపారు. అదే విధంగా పోలింగ్ కేంద్రాల వద్ద అసౌకర్యాలు కలగకూడదని అన్నారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజనం ను నాణ్యమైన భోజనం అందించాలని అదేశించారు. ప్రతీ ఓటరు ఓటు వేసే విధంగా వారిని చైతన్యం పరచాలని



సూచించారు. ఆయన వెంట నేలకొండపల్లి మేజర్ పంచాయతీ కార్యదర్శి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి

- ఘనంగా సుదర్శన చక్ర స్నానం
- నేటి నుండి నిత్యకళ్యాణాలు, దర్బారు సేవలు పునరుద్ధరణ



ప్రజాపక్షం/భద్రాచలం : వసంత పక్ష ప్రయుక్త శ్రీరామ నవమి తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాలు భద్రాచల శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఆలయంలో పరిసమాప్తమయ్యాయి. ఈ నెల 9వ తేది నుండి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాగా తొలిరోజు అంకురారోపణ, 14వ తేది ధ్వజపట లేఖనం, 15న ధ్వజారోహణం, 16న ఎదుర్కోలు ఉత్సవం, 17న శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం, 18న పట్టాభిషేకం నిర్వహించారు.

**ఘనంగా సుదర్శన చక్ర స్నానం...**

బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం పావన గోదావరి నదీ తీరంలో సుదర్శన చక్రస్నానం జరిపించారు. ఈసందర్భంగా స్వామికి విశేష అభిషేకం జరిగింది. పూర్ణాహుతి, శేష వాహన సేవ, ధ్వజారోహణం, దేవతోద్వాసనం, ద్వాదశ ప్రదక్షిణలు, ద్వాదశ ఆరాధనలు, శ్రీపుష్ప యాగం జరిపించారు.

**నిత్యకళ్యాణాలు ప్రారంభం...**

శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రద్దు చేసిన నిత్యకళ్యాణాలు, దర్బారు సేవలు నేటితో తిరిగి ప్రారంభం కానున్నాయి. నిత్యకళ్యాణాలను ఎప్పటి లాగానే బేడా మండపంలో నిర్వహించనున్నారు. దర్బారు సేవలు సైతం ప్రారంభం కానున్నాయి.

## రామయ్యను దర్శించుకున్న ఖమ్మం ఎంపి అభ్యర్థి నామ



ప్రజాపక్షం/భద్రాచలం : శ్రీ సీతారామ చంద్ర స్వామి వారిని ఖమ్మం బిఆర్ఎస్ మాజీ ఎంపి, ప్రస్తుత ఎంపి నామా నాగేశ్వర రావు మంగళవారం దర్శించుకున్నారు. నేడు నామినేషన్ వేయనున్న సందర్భంగా ఆయన రామయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గర్భగుడిలోని గోత్ర నామాలతో పూజలు చేసిన ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ తాయారమ్మ, శ్రీ అభయాంజనేయ స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం తరుపున నామాకు శాలువా కప్పి, మెమొంటోను బహుకరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## మొక్కల రక్షణకు పచ్చని పందిరి



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని 31 గ్రామపంచాయతీలలో హరితహారంలో భాగంగా సుమారు రెండు లక్షల మొక్కలు పెంపకం కోసం ఈఏడాది నర్సరీలు ఏర్పాటు చేశారు. వేసవికాలంలో మండే ఎండల తీవ్రత పెరగడంతో మండల పరిధిలోని గ్రామపంచాయతీల లో నర్సరీలలో పండ్లు, పూలు, నీడనిచ్చే, (గ్రీన్ షెడ్ నెట్) మొక్కల రక్షణకు పచ్చని పందిళ్లు ఏర్పాటు చేశారు. ఎండలకు మొక్కలు ఎండిపోకుండా తగినట్లుగా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో హేమమాలినిలు తెలిపారు. వీటి సంరక్షణకు వన సేవకులను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ప్రతిరోజు నర్సరీలు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పంచాయతీ కార్యదర్శులు తోపాటు మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. మంచి వాతావరణం లో నర్సరీలను పెంచుతున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

## ఊరూరా ఉపాధి జాతర



ప్రజాపక్షం/కల్లూరుః పెరిగిన ఉపాధి కూలీల సంఖ్య తో గ్రామాల్లో జాతర వలె ఉదయం 10 గంటల లోపు కొనసాగుతున్నది. కల్లూరు మండల పరిధిలోని చంద్రుపట్ల , చిన్న కోరు కొండి , చెన్నూరు ,పెద్ద కోరుకొండి, పేరు వంచ, ఎర్రబోయినపల్లి, పాయపూరు, కప్పల బంధం, వాచ్యనాయక్ తండ తదితర గ్రామాలలో రోజువారి కూలీల సంఖ్య 200ఉండటంతో పెద్ద జాతర వలె ఉంది. ప్రభుత్వాలు కూలీల ధర పెంచడంతో ఉదయం పూట 7 గంటల నుంచి 11 గంటల వరకు పెద్ద జాతర వలె గ్రామాలలో కనబడుతుంది. గ్రామాలలో చెరువుల పూడక తీయుట, కాలువలు పూడికతీత, తదితర పనులు వద్ద పెద్ద తిరునాళ్ల వల్లే ఉదయం 11 గంటలకు జన జాతర కొనసాగుతుంది. కూలీల వేతనం పెరగటం సౌకర్యాలు మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టెంటు సౌకర్యం, కూడా కల్పించడంతో సౌకర్యాలు కల్పించడంలో ఇబ్బందులు లేకుండా ఉండటం వల్ల అధిక సంఖ్యలో కూలీలు హాజరవుతున్నారు. కూలీలందరికీ పని కల్పిస్తున్నామని అడిగిన వారందరికీ కూలి కల్పిస్తూ జీవనభృతి ప్రస్తుతానికి కల్పిస్తున్నామని ఎంపీడీవో పేర్కొన్నారు. పని కావలసిన వారందరూ ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలని ఆయా గ్రామాల ప్రజలను కూలీలందరినీ కోరారు.

## పారదర్శక ఎన్నికల నిర్వహణకు సమష్టిగా కృషి చేయాలి

**అంతర్రాష్ట్ర సరిహద్దు జిల్లాల అధికారుల సమావేశం**




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రాష్ట్రాల సరిహద్దు జిల్లాల అధికారులు సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఎన్నికలు పారదర్శకంగా పూర్తయ్యేందుకు సమిష్టిగా కృషి చేయాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దు జిల్లాల కలెక్టర్లు, జిల్లాల సిపిలు, ఎస్పిలు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో సరిహద్దు ఎన్నికలకు సంబంధించిన అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సరిహద్దు జిల్లాల అధికారుల సమన్వయ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ విపి గౌతమ్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, భద్రాద్రి కొత్తగూడెంజిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా, ఎస్పి రోహిత్ రాజ్, ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్పి మేరీ ప్రశాంతి, ఐటిడిఏ పివో సూర్యతేజ, ఇతర అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలలో పోలీసులు, అటవీశాఖ సజావుగా ఎక్సైజ్ , వాణిజ్య పన్నుల శాఖలతో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులలో 24X7 నిరంతర తనిఖీలు చేపట్టాలని నిర్ణయించారు. సమాచార వ్యవస్థను సమన్వయం చేసుకుంటూ సజావుగా ఎన్నికలు సాగేలా చూడాలన్నారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలతో సరిహద్దులో ఉన్న సమస్యాత్మకమైన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. ప్రధానంగా అక్రమ మద్యం, ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వివిధ వస్తువులు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రధాన రహదారులతో పాటు అక్రమ రవాణా చేసే అవకాశం ఉన్న వివిధ మార్గాలపై నిఘా పెట్టాలని నిర్ణయించారు. ఎన్ఫోర్స్మెంట్ బృందాలతో 24 గంటలు పటిష్ట గస్తీ ఏర్పాటు చేసినట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై ఇరు రాష్ట్రాల అధికారులు చర్చించి పార్లమెంటు ఎన్నికలు సజావుగా పూర్తయ్యేలా తీసుకోవాల్సిన ఏర్పాట్లపై సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు.

## ఉపాధి పనుల్లో ఒకే రోజు లక్ష మంది కూలీలు

**అభినందించిన కలెక్టర్**





ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మంజిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నందు 2024 25 ఆర్థిక సంవత్సరంలో మొదటి నెలలోనే మంగళవారం 23 తారీఖున లక్ష మంది కూలీలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ విపి గౌతమ్ అధికారులకు, సిబ్బందికి, కూలీలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఎంజిఎన్ఆర్ ఈజిఎస్ సిబ్బంది పని చేసి జిల్లాలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 100 రోజుల పని దినాలు కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఇందుకు జిల్లా స్థాయి, మండల స్థాయి , గ్రామీణ స్థాయి సిబ్బంది కృషి చేయాలని రాష్ట్ర స్థాయిలో మన జిల్లాను మొదటి స్థానంలో ఉంచాలన్నారు. ఎంపిడివోలు, ఎంజిఎన్ఆర్ఈజిఎస్ సిబ్బంది, గ్రామ పంచాయితీ ప్రత్యేకాధికారులు, పంచాయితీ కార్యదర్శులు ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి పనులు కల్పించుటకు గాను గ్రామాల్లోని చెరువులు, కాలువ పూడిక పనులు , మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులు, భూ గర్భ జలాల పెరుగుదలకు సంబంధించిన పనులు కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## అకాల వర్షం.. అపార నష్టం..!

**కన్నీరుమున్నీరవుతున్న అన్నదాతలు**





ప్రజాపక్షం/సుజాతనగర్ః అకాల వర్షం తో అన్నదాతలకు నష్టం వాటిల్లింది. ఆరుకాలం కష్టపడి అందిన కాడికి అప్పులు తెచ్చి అన్నదాతలు పంటలు సాగు చేస్తున్నారు. ప్రతి ఏడాది పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలతో పంటలు తీవ్రంగా నష్టం జరుగుతుంది. పంట చేనులో విత్తనాలు నాటిన అప్పుడు నుండి చీడపీడ రోగాలతో అనేక కంపెనీల మందులు పిచికారి చేసిన ప్రయోజనం లేక పెరిగిన మందుల ధరలు కూలీల ఖర్చులు అప్పుల బాధలు గిట్టుబాటు ధర లేక అన్నదాత అప్పుల్లో కూరుకు పోతున్నాడు. ఆదివారం సాయంత్రం నుండి ఈదురు గాలులతో, గాలి దుమ్ములతో వడగళ్ల వానతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంట చేతికి వచ్చిన జొన్న మొక్కజొన్న కంకులు వచ్చిన తర్వాత మొత్తం చేనులో కింద పడిపోయింది. వేపల గడ్డ గ్రామానికి చెందిన ఉడుముల శ్రీనివాస్ రెడ్డి ఐదు ఎకరాలు మొక్కజొన్న పంటలు సాగు చేశాడు. వర్షం రావడంతో పంట మొత్తం నేలకు ఒరిగింది. ఏడాది మొక్కజొన్న పంట వేసినా రైతులు అందరి పంట పొలాల పరిస్థితి ఇదే విధంగా తయారయింది తమకు జరిగిన నష్టానికి ప్రభుత్వ అధికారులు స్పందించి తమ పంటలను పరిశీలించి నష్ట పరిహారం అందించాలని సుజాతనగర్ మండల రైతులు కోరుతున్నారు.

## పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్



ప్రజాపక్షం/సుజాతనగర్ః మండల పరిధిలోని సింగభూపాలెం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కుసుమ శ్రీనివాస్ పదవి విరమణ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ మానవ జీవితం మన కోసమే కాదని ఇతరుల కోసం కూడా జీవించాలనే పరమార్థమే ఉత్తమమైన మానవ జన్మకు సార్థకత అని అటు ఉపాధ్యాయులుగా, ప్రధానోపాధ్యాయులుగా, మాజీ మండల విద్యాశాఖ అధికారి గా సుజాతనగర్ నోడల్ అధికారిగా, పీఆర్‌టియూ సంఘ రాష్ట్ర నాయకుడిగా, శ్రీ కుసుమ శ్రీనివాస్ అందించిన విశిష్టమైన సేవలు బహు ప్రశంసనీయమని ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని, సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు, కవి, సినీ గీత రచయిత, గాయకులు, సమాజ సేవకులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ఉద్ఘాటించారు. సింగభూపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుసుమ శ్రీనివాసరావు మరియు సతీమణి తస్మీం ఆయేషా దంపతులను పాఠశాల స్టాఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సన్మాన వేడుకల్లో పలువురు పాల్గొని పూలమాలలతోనూ, శాలువాలతోనూ ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆచార్య డాక్టర్ మద్దెల స్వయంగా వ్రాసిన ప్రత్యేక గీతాన్ని మధురంగా ఆలపించి అందర్నీ అలరించారు. ఘనంగా జరిగిన ఈ ఆత్మీయ సన్మాన వేడుకలలో కుసుమ శ్రీనివాసరావు, సతీమణి తస్లీం ఆయేషా కుమారుడు అన్వేష్, ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ లతోపాటు వారిని సత్కరించి అభినందించిన వారిలో ముఖ్యఅతిథిగా హాజరైన పీఆర్‌టియూ రాష్ట్ర నాయకులు డి వెంకటేశ్వర్లు (డివి), పీఆర్‌టియూ సుజాతనగర్ మండల అధ్యక్షులు ఎండి షఫీ అహ్మద్ సభాధ్యక్షులు, పీఆర్‌టియూ జిల్లా నాయకులు సాయిబాబా, ఉపాధ్యాయ నాయకులు శ్రీనివాస్, జహంగీర్, శ్రీకాంత్, జయదాస్, గ్రామ పెద్దలు ఇస్తారయ్య పాఠశాల సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## చలివేంద్రాలు ఎంతో ఉపకరిస్తాయి..

**-ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ప్రతిక్ జైన్**




ప్రజాపక్షం/బూర్గంపాడు: ప్రతి ప్రాణకోటికి ఆహారంతో పాటు మంచి నీరు అనేది తప్పని సరి అని, ఎండలు ముదురుతున్నందున ప్రజలు వారి అవసరాల నిమిత్తము ఇంటి నుంచి బయటకు వచ్చినప్పుడు వారి యొక్క దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతో ఉపకరిస్తాయని భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ప్రతిక్ జైన్ అన్నారు. మంగళవారం సారపాకలోని మెయిన్ సెంటర్‌లో ఐటిసి, సారపాక గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లల నుంచి మొదలుకొని వయసొచ్చిన, వృద్ధుల వరకు ఇతర పనుల నిమిత్తం ఎండను సైతం లెక్కచేయకుండా బయటికి వస్తుంటారని, ఒకానొక సమయంలో మంచినీరు ప్రతి ఒక్కరికి తప్పనిసరి అని వారి యొక్క దాహార్తి తీర్చడానికి ఈ చలివేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. సారపాక పారిశ్రామిక ప్రాంతమని ఎక్కువ శాతం ప్రజలు తప్పని సరిగా ఇతర పనుల నిమిత్తం వస్తుంటారని, ప్రజలను దృష్టిలో పెట్టుకొని ఈ చలివేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి రోజు చలివేంద్రంలో మంచినీరు అందుబాటులో ఉండేలా గ్రామ పంచాయితీ ఈవో ప్రత్యేక బాధ్యత తీసుకొని, వారి యొక్క సిబ్బందిని చలివేంద్రాన్ని సక్రమంగా నిర్వహించే విధంగా చూడాలని దాహార్తి తీర్చుకోవడానికి వచ్చే ప్రజలకు మాత్రం తప్పని సరిగా స్వచ్ఛమైన చల్లటి మంచినీరు అందించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిడివో జమలారెడ్డి, ఐటిసి అధికారి చెంగల్‌రావు, పంచాయితీ ఈవో మహేష్, రోటరీ ఇన్ భద్రాద్రి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల నిర్వహణలో తల్లిదండ్రులే కీలకం

**-ప్రధానోపాధ్యాయులు మోహన్**
**-ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు**





ప్రజాపక్షం/బూర్గంపాడు: పాఠశాల నిర్వహణలో తల్లిదండ్రులే కీలక పాత్ర పోషిస్తారని వారే అత్యంత కీలకమని వారి సహాయ సహకారాలు లేనిదే పాఠశాల నిర్వహణ సవ్యంగా సాగదని సోంపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తేజావత్ మోహన్ అన్నారు. మంగళవారం పాఠశాల నందు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే వారి తల్లిదండ్రులకు పాదాలను పువ్వులతో పాదపూజను నిర్వహించారు. అదే విధంగా పరీక్షల ప్రగతి పత్రములను అందించారు. అనంతరం గురుకులంలో సీటు సాధించిన ముగ్గురు విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు బాగి వెంకట్రావ్ విద్యార్థులకు కేక్, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు, విద్యార్థుల మానసిక సర్వంగ వికాసానికి తోడ్పాటుకు దోహపడుతుందన్నారు. గ్రామంలోని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ వే వేడుకలను నిర్వహించిన పాఠశాల ఉపాధ్యాయులను గ్రామస్తులు అభినందించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ హెడ్మాస్టర్ కేవీ, గాదె నర్సిరెడ్డి, బాగి వెంకట్రావ్, పండగ వెంకటేశ్వర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్ పర్సన్ తోకల అనిత, ఉపాధ్యాయులు సైదులు, రవి, బిచ్చా, తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తి చేయాలి

**కలెక్టర్ ప్రియాంక ఆలా**





ప్రజాపక్షం/పినపాకః వేసవి సెలవులు ముగిసేలోగా జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా ఎన్నికైన అన్ని పాఠశాలల్లో మరమ్మతు పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా అధికారులను ఆదేశించారు. మంగళవారం పినపాక మండలంలో ఆమె పర్యటించి పాండురంగాపురం, జానంపేట పాఠశాలలను కలెక్టర్ పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మంజూరైన పనులను మే నెల ఆఖరుకెల్లా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం జానంపేట గ్రామపంచాయతీ సాయి నగర్, సుందరయ్య నగర్ గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. 23 గ్రామ పంచాయతీల పరిధిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం బయ్యారం క్రాస్ రోడ్ లో డ్రైనేజీ కొలతకు మించి నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదులు వస్తున్నాయని డ్రైనేజీ వరకు వెంటనే శుభ్రం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సూర్య నారాయణ, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు, పిఆర్ ఏఈ రేనాల్డ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయకృష్ణ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి



ప్రజాపక్షం/పినపాకః పినపాకక్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దుర్గా భవాని తెలిపారు. మంగళవారం పినపాక మండల పరిధిలోని అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో పిల్లలకు, తల్లిదండ్రులకు క్షయా వ్యాధిపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం నయం కాకపోయినా, చెమటలు పట్టడం, బరువు పెరగకపోవడం, బరువు తగ్గడం, ఆలసట, నీరసం, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండటం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో సంప్రదించి వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మొదటిలోనే గుర్తించడం వల్ల ప్రమాదాన్ని తగ్గించవచ్చని తెలిపారు. కార్యక్రమం లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది,ఆశాలు,అంగన్‌వాడీలుపాల్గొన్నారు

## మాలోత్ కవిత నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్‌పిటిసి శ్రీలత



ప్రజాపక్షం/బూర్గంపాడు: మహబూబాబాద్ బిఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవిత నామినేషన్ కార్యక్రమంలో బూర్గంపాడు మండల జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత మంగళవారం బూర్గంపాడు ముఖ్య నాయకులతో కలిసి పాల్గొన్నారు. తొలిత బిఆర్ఎస్ పార్టీ ఎంపి అభ్యర్థి మాలోత్ కవితని వారి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆళ్లపల్లి ఎంపిపి కొండ్రు మంజుభార్గవి, బూర్గంపాడు మండల సొసైటీ ఛైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బిఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, సారపాక టౌన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొనకంచి శ్రీనివాసరావు, సారపాక టౌన్ కార్యదర్శి తిరుపతి ఏసోబు, బిఆర్ఎస్ పార్టీ టౌన్ యువజన విభాగం ప్రెసిడెంట్ సోము లక్ష్మి చైతన్యరెడ్డి, పలువురు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ తరపున ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపడతాం



ప్రజాపక్షం/బూర్గంపాడు: రోటరీ క్లబ్ తరపున నాగినేనిప్రోలురెడ్డిపాలెం గ్రామంలో ముత్యాలమ్మ గుడి వద్ద నున్న ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తే ఆ స్థలంలో రోటరీ తరపున ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపడతామని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ముత్యాలమ్మ గుడి వద్ద నున్న ప్రభుత్వ స్థలాన్ని గ్రామస్తులతో కలిసి ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్థలాన్ని గ్రామ పంచాయితీ, జిల్లా ఉన్నతాధికారులు అనుమతినిస్తే రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఫంక్షన్ హాల్ నిర్మాణం చేయిస్తామని, ఫంక్షన్ హాల్ ను ప్రతి ఒక్కరు వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. గ్రామస్తులు జిల్లా కలెక్టర్ ద్వారా అనుమతి తీసుకోవాలని తద్వారా గ్రామంలో ఫంక్షన్ హాల్ నిర్మాణం చేసే బాధ్యత తాను తీసుకుంటానని తెలిపారు. ఫంక్షన్ ని బట్టి ఫంక్షన్ హబ్బూల్ మెయింటినెన్స్‌కు సరిపోయే విధంగా అప్పటి సందర్భాన్ని బట్టి ధరలను కేటాయించవచ్చని తద్వారా వచ్చే ఆదాయాన్ని ఖర్చులకు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆయనతో పాటు గ్రామస్తులు సూరెడ్డి చందారెడ్డి, గాద పెద్దిరెడ్డి, పత్తి వెంకటేశ్వరరెడ్డి, పాలెం రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వీర హనుమాన్ విజయ యాత్ర



ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయ యాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ మండల అధ్యక్షులు డాక్టర్ కారంపూడి సత్యనారాయణ రాజు, ఉపాధ్యక్షులు పువ్వాల శ్రీనివాసరావు, కార్యదర్శి కేసరి భద్రం, బజరంగ్దళ్ సంయోజక్ అత్యం సాయి, జిల్లా సామాజిక సమరసత ప్రముఖ్ గొర్ల రాజు, భక్తాంజనేయ స్వామి దేవాలయం ఛైర్మన్ శనగపాటి రవి, అనుమల శ్రీనివాస, పద్ధం బుజ్జి, అవినాష్, బిక్కమల్ల సుధాకర్, హిందూ బంధువులు, మహిళా భక్తులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## ఎంపి అభ్యర్థి కవితను మర్యాద పూర్వకంగా కలిసిన రావులపల్లి



ప్రజాపక్షం/భద్రాచలం : మహబూబాబాద్ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి మాలోత్ కవితను బిఆర్ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కవిత నామినేషన్ వేస్తున్న సందర్భంగా మహబూబాబాద్‌కు చేరుకున్న రావులపల్లి బృందం ఆమెను కలిసి శ్రీ సీతారామ చంద్ర స్వామివారి ప్రతిమను బహుకరించారు. ఈ సందర్భంగా రావులపల్లి మాట్లాడుతూ మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ నుండి పోటీలో ఉన్న మాజీ ఎంపి, ప్రస్తుత అభ్యర్థి మాలోత్ కవిత విజయ ఖాయమని, అమె గెలుపు కోసం ప్రతీ ఒక్క కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నాయకులు మానె రామకృష్ణ, ఐనాల రామకృష్ణ, లకావత్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కాలిపోయిన ఆరు వ్యవసాయ మోటార్లు





ప్రజాపక్షం/నేలకొండపల్లి : ప్రమాదవశాత్తు వరి పంట కొయ్య లకు నిప్పు అంటుకోవటంతో రైతులు వ్యవసాయ మోటార్లు మంటలకు ఆహుతైయ్యాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని చెరువు మాధారం చెరువు సమీపంలోని వరి పంట కొయ్య పొలాలకు మంగళ వారం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. అది కాస్తా ఈదురు గాలుల కారణంగా మంటలు వ్యాపించాయి. మంటలు ఎగిసిపడుతూ చెరువు మాధరం నుంచి బైరవునిపల్లి వైపు గా మంటలు దూసుకపోతున్నాయి. రైతులు గ్రహించి ఆయా సమీపంలోని రైతులు వ్యవసాయ మోటార్లు ద్వారా పొలాలను తడి పారు. దీంతో మంటలు వేగం తగ్గింది. అప్పటికే గ్రామానికి చెందిన నెల కుర్తి సత్యనారాయణ రెడ్డి, ఖాదర్, పగిడిపత్తి బాలయ్య, పగిడిపత్తి వెంకటేశ్వర్లు, బెల్లం కొండ లక్ష్మి నారాయణ లకు చెందిన మొత్తం ఆరు మోటార్లు మంట లకు కాలిపోయాయి. వీటితో పాటు రైతులు పొలాల నీటి సరఫరా కోసం పరిచిన పైపులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఇది ఇలా ఉండగా రెండు గ్రామాల దగ్గరకు మంటలు వ్యాపించాయి. రైతులు సమిష్టి కృషి తో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. పలువురు కు చెందిన రైతులు పొలాలలో ఉన్న తాటిచెట్లు కాలిపోయాయి.

# రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారంలో, పరిపాలనలో పూర్తి గా విఫలమైందని బిఆర్ఎస్ ఖమ్మం ఎంపి అభ్యర్థి నామా నాగేశ్వరరా వు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు విమ ర్శించారు. ఖమ్మం పార్లమెంట్ బిఆర్ ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజ యాన్ని కాంక్షిస్తూ మంగళవారం దమ్మపేట అప్పారావుపేట రూట్‌లోని మామిడితోటలో బిఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈసందర్భంగా మెచ్చా మాట్లా డుతూ వడ్లు కొనడం చేతకాని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని, రైతులు గోస పడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సోయి లేదని అన్నారు. గ్రామాల్లో ప్రజలు కేసిఆర్ ఉన్న రోజులే బాగున్నాయని అంటున్నారని, ఎప్పుడు ప్రభుత్వం కూలిపోతుందన్న భయంతో కాంగ్రెస్ నేతలు ఇసుక, మట్టి దందాలతో దోచుకునే పనిలో బిజీగా ఉన్నారని ఆరోపించారు. పరిపాలన చేతకాకపోతే మాయ మాటలతో గెలిచిన మంత్రులు, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశా రు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు బంపర్ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఎంపి అభ్యర్థి నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతు కుటుంబం నుండి వచ్చిన తనకు రైతుల కష్టాలు తెలుసునని, రైతులకు అండగా నిలబడుతానన్నారు. అలాగే ఖమ్మం జిల్లా అభివృద్ధికి తనవంతు శక్తివం చన లేకుండా కృషి చేస్తానన్నారు.తనను అఖండ మెజార్టీతో గెలిపించా లని ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తాటి వెంకటేశ్వర్లు, జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాశ్, రావు జోగేశ్వరరావు, జెడ్పి టిసి సున్న నాగమణి, ఎంపిపి జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, వగ్గెల పూజ, వైస్ ఎంపిపి దారా మల్లికార్జున్‌రావు, బిఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యక ర్తలు పాల్గొన్నారు.


# సామాజిక అంశాలే ఇతివృత్తాలుగా బాల సాహిత్య రచన



**-నాగుపల్లి ఉన్నత పాఠశాలలో నాలుగు పిల్లల పుస్తకాల ఆవిష్కరణ**
**-తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో నమోదు**

ప్రజాపక్షం/దమ్మపేట: తెలుగు బాల సాహిత్య చరిత్రలో ఒక అద్భుత మైన ఘట్టం మంగళవారం దమ్మపేట మండలంలోని నాగుపల్లి ఉన్నత పాఠశాలలో ఆవిష్కృతమైంది.పిల్లలు రాసిన నాలుగు బాల సాహిత్య పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. నాగుపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయిని బజ్జూరి సరళ అధ్యక్షతన తెలుగు ఉపాధ్యాయిని, కవయిత్రి ఉరిమళ్ళ సునంద ఆధ్వర్యంలో నవీన కథావనం పుస్తకాన్ని మండల విద్యాధికారి కె.లక్ష్మి, నాగుపల్లి కథా కదంబం పుస్తకాన్ని బజ్జూరి సరళ, పెద్దయ్యాక పుస్తకాన్ని తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సియిఓ. బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. నాలుగో పుస్తకమైన సమీక్షల సమాహారాన్ని పాఠశాల విద్యార్థులే ఆవిష్కరించుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో అతిథులుగా పాల్గొన్న పలువురు సాహితీ వేత్తలు మాట్లాడుతూ బాలసాహిత్యంలో వస్తున్న ఆధునిక మార్పు నాలుగు పుస్తకాలలో కనిపించిందన్నారు. సమాజాన్ని పిల్లలు నిశితంగా పరిశీ లించి కథలుగా మలచడం విశేషమన్నారు. నాగుపల్లి పదవ తరగతి విద్యార్థిని సాయి నవీన ఒక్కరే ఇరవై కథలు రాయగా వాటిని ఉరిమళ్ళ సునంద పుస్తక రూపంలో తెచ్చారని అభినందించారు. ఆవిష్కరణ పొందిన నాలుగు పుస్తకాలలో రెండు కథల పుస్తకాలు కాగా, మరొకటి పుస్తక సమీక్ష లో పిల్లలు తమకు నచ్చిన పుస్తకాలను సమీక్షించి వ్యాసాలు రాయగా పుస్తకంగా ప్రచురించారు. నాలుగో పుస్తకం పెద్ద య్యాక లో పిల్లలు తాము భవిష్యత్తులో ఏమీ కావాలనుకుంటున్నారో ఊహించి రాశారు. ఇవన్నీ బాల సాహిత్య చరిత్రలో మరపురాని ఘట్టంగా నిలిచిపోతాయని దమ్మపేట మండల విద్యాధికారి కె.లక్ష్మి అన్నారు. సమావేశంలో సాహితీవేత్తలు నామా పురుషోత్తం, రాచమళ్ళ ఉపేందర్ బి.మధుసూదన రాజు మాట్లాడారు. తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో నమోదు తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నాగుపల్లి ఉన్నత పాఠశాల నమోదు అయింది. ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ చింత పట్ల వెంకటాచారి పాఠశాల గురించి తెలుసుకొని ప్రత్యేక ప్రశంసా పత్రం పంపగా సియిఓ బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఆ సంస్థ తరపున ఉరిమళ్ళ సునంద, ఉపేందర్ దంపతులకు అందచేసి సత్కరించారు. ఏడాది వ్యవధిలోనే ఏడు పిల్లల పుస్తకాలను ప్రచురించి ఒక ప్రభుత్వ పాఠశాల వేదికగా ఆవిష్కరించుకోవడం అభినందనీయ మని సిఈఓ బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత మధు సూదన రాజు అన్నారు. చివరగా ఉరిమళ్ళ సునంద మాట్లాడుతూ పిల్ల లను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా ప్రతిభ గలవారికి ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అతిథులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

# సింగరేణి మండలంలో విగ్రేష్‌నాయక్ పర్యటన



ప్రజాపక్షం/కారేపల్లి: మండలంలో పలు శుభకార్యాలకు, దైవ కార్యా లకు పరామర్శలకు వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ తనయుడు విగ్నేష్‌నాయక్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీను, రాష్ట్ర మహిళా ఉపాధ్య క్షురాలు పగడాల మంజుల, కోటి అప్పారావు, జిల్లా నాయకులు రామ్మూర్తినాయక్, మండల నాయకులు మేదరి టోని, సొసైటీ డైరెక్టర్ అడ్డగోడు ఐలయ్య, సొసైటీ డైరెక్టర్ హీరాలాల్, జిల్లా నాయకులు భీమ దునాయక్, యూత్ కాంగ్రెస్ వైరా ఉపాధ్యక్షులు ధరావత్ వినోద్‌నా యక్, మైనారిటీ నాయకులు తాజుద్దీన్, జాని, పాత కమలాపురం సర్పంచ్ మంగ్య, వినోద్, వెంకన్న, బాలకృష్ణ, కార్యకర్తలు, అభిమా నులు పాల్గొన్నారు.

# గ్రామదీపికలు, వీవోలు రాజకీయాల్లో పాల్గొనవద్దు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ఎన్నికల ప్రచారంలో, సభలలో, సమావేశాలలో గ్రామ దీపికలు, గ్రామ సమాఖ్యలు పాల్గొంటే తగిన చర్యలు తీసుకుంటా మని ఐకేపీ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్(డీ పీఎం) పద్మావతి హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాల యంలో మంగళవారం సమావేశం ను నిర్వహించారు. సమాఖ్య ప్రతినిధులు ప్రతీ పంచాయతీ లో నూరు శాతం ఓటింగ్ జరిగేలా చూడాలని ఆదేశించారు. రాజకీయాలకు దూరంగా ఉండా లని సూచించారు. సీవిజిల్ యాప్ పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రతీ ఓటరు ఓటు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిబంధనలు ఖచ్చితంగా పాటించా లని సూచించారు. ఈ సమావేశంలో నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య, ఐకేపీ ఏపీయం ఆశోక్‌రాణి, గ్రామదీపికలు, గ్రామ సమాఖ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా అంబటి ఈశ్వర్





ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : ఖమ్మం జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా ఖమ్మం రూరల్ మండలంలోని మద్దుల పల్లి గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకుడు అంటి సుబ్బారావు కుమా రుడు ఈశ్వర్ నియమితుడయ్యాడు. మంగళవారం ఖమ్మం నగరంలోని కాంగ్రెస్ ఆఫీసులో జిల్లా ప్రెసిడెంట్ ఎడ్ల పల్లి సంతోష్ చేతులమీదుగా పత్రాన్ని అందజేశారు. అనంతరం అంటి ఈశ్వర్ మాట్లాడుతూ...తనపై నమ్మకం ఉంచి అప్పగించిన ఈ బాధ్యత తనకు మరింత బాధ్యతను పెంచిదన్నారు. అందరినీ కలుపుకుపోతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు యువత సమస్యల పరిష్కారానికి పని చేస్తున్నానడు. ఈ సందర్భంగా గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేయోభిలాషులు ఈశ్వర్‌ను అభినందించారు.

# 25 నుంచి ఓటర్ స్లిప్పులు పంపిణీ



ప్రజాపక్షం/కల్లూరు: సత్తుపల్లి నియో జకవర్గ పరిధిలోని మండలాలలో 25వ తేదీ గురువారం నుంచి ఇంటింటికి ఓటర్ స్లిప్పులను బి ఎల్ వో లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్డీ వో రాజేందర్ గౌడ్ పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయి పరిధిలోని వేంసూ రు, సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, మండలాలలో 294 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వాటి పరిధిలో 2,43,460. లక్షల ఓటర్లు ఉన్నారని వారందరికీ 25 నుంచి ప్రతి ఓటర్కు స్లిప్పులు అందిస్తున్నామని అదే విధంగా 13 రకాలగుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి తీసుకుని వచ్చి తమ విలువైనఓటును వినియోగించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఇప్ప టికే నియోజకవర్గస్థాయిలో పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులను పూర్తిస్తాయిలో పరిశీలించి నట్లు తెలిపారు. మండల స్థాయిలో గ్రామస్థాయిలో ఉన్న ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు సౌకర్యాలపై సమీక్షిస్తున్నట్లు ఆర్డీవో పేర్కొన్నారు.

# గురుకులంలో ప్రవేశం పొందిన గ్రామీణ విద్యార్థులు

ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల విద్యార్థిని విద్యార్థులు 5వ తరగతిలో ప్రవేశం పొందారు. కల్లూరు మండల పరిధిలోని చిన్న కోరుకొండి, మర్లపాడు, పోచవరం, పెద్ద కోరుకొండి, చెన్నూరు, ముచ్చవరం, కల్లూరు, బత్తులపల్లి, పేరువంచ తదితర ప్రాథమిక పాఠశాలల నుంచి 4వ తరగతి విద్యార్థిని విద్యార్థులు ఐదో తరగతికి ప్రవేశ పరీక్ష రాశారు. వీరిలో మండల జిల్లా స్థాయికి గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసించేందుకు ప్రవేశాన్ని పొందారు. దీనివలన వారి యొక్క తల్లిదండ్రులు మండల విద్యాశాఖ అధికారిని, ఉపాధ్యాయులను విద్యార్థులను ప్రముఖులు అభినందించారు.

# మంత్రి తుమ్మలని సన్మానించిన టిడిపి నాయకులు



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు కిన్నెర కళ్యాణ మండపం నందు పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ విజయాన్ని కాంక్షి స్తూ పినపాక నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం స్థానిక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖామా త్యులు, పార్లమెంట్ ఇంచార్జ్ తుమ్మల నాగేశ్వరరావు వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే పాయం పిలుపు మేరకు హాజరైన టిడిపి నేత వాసిరెడ్డి చలపతి రావు అధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సింగారం మాజీ సర్పంచ్ బచ్చల భారతి, పార్టీ మహిళ నేతలు ఖమ్మున్నీసా బేగం, చావా శ్రీదేవి, మండల అధ్యక్షులు జగ దీశ్వరరావు, తొలెం సాంబయ్య, తోట వెంకటేశ్వర్లు, మల్లీడి లోకేష్, యు. వి రాంబాబు, డి.గాంధీ, సుబ్బారావు, ఇల్లందుల అప్పారావు, ఇల్లందుల నరసింహులు, పాలవై సుధాకర్, వై. పూర్ణ, కె. రామారావు, కంచేటి వెంకటేశ్వర్లు, యం.వెంకటేశ్వర్లు, అబ్దుల్ నబి, గఫూర్, బచ్చల సుమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఇద్దరు అధికారులపై విచారణకు సిద్ధం?

**-ప్రభుత్వ గుట్ట ఎలా రిజిస్ట్రేషన్ చేశారు**
**-434 గజాలు ఎక్కడ నుండి వచ్చింది?**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో ఉన్న సర్వే నెంబర్ 98 గుట్ట ఆక్రమణ, రిజిస్ట్రేషన్‌పై ఆ ఇద్దరు అధికారుల పాత్రపై ప్రత్యేక విచారణ చేయనున్నట్లు సమాచారం. ఎందుకంటే బాధ్యత గల ప్రభుత్వ అధికారులు అయి ఉండి లక్షలాది రూపాయల ప్రభుత్వ గుట్టను తప్పుడు రిజిస్ట్రేషన్ చేయడంపై పూర్తిస్థాయిలో విచారణ చేయనున్నారు. గుట్ట రిజిస్ట్రేషన్‌కు సంబంధించి అప్పటి రిజిస్టర్ అప్పటి మున్సిపాల్ కమీషనర్ పాత్ర ఏమైనా ఉందా అనే దానిపై పూర్తిస్థాయిలో అధికారులు లోతుగా విచారణ చేయనున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే 275.55 గజాలు స్థలాన్ని 709.55 గజాలుగా ఎలా రిజిస్ట్రేషన్ చేశారు. అసలు ఆ 275.55 గజాలు ఏ విధంగా వచ్చింది అనే దానిపై లోతుగా విచారిస్తున్నారు. అయితే గుట్ట ప్రక్కనే ఇళ్ళు ఉండడంతో గుట్టను ఆక్రమించుకునేందుకు ఎవరు సూత్రాధారి అనే దాని పైన కూడా విచారణ చేయనున్నారు. ఇప్పటికే గుట్ట రిజిస్ట్రేషన్ చేయడంలో నరేందర్‌రెడ్డి అనే వ్యక్తితో పాటు ఎవరెవరు ఉన్నారు. అధికారులు వారికి ఏ విధంగా సహకరించారుఉ. గుట్ట ప్రక్కనే ఇళ్ళు ఉండడంతో ఆక్రమించుకునేందుకు 434 గజాలు ఏ విధంగా వచ్చింది. ఆ భూమి ఎక్కడ ఉంది అనే దారిపై లోతుగా విచారిస్తున్నారు. ఏది ఏమైనప్పటికి గుట్ట తప్పుడు రిజిస్ట్రేషన్‌తో రిజిస్ట్రేషన్ చేసిన అధికారులు దానికి సహకరించిన అధికారులు రిజిస్ట్రేషన్ పర్వానికి తెరలైపోయిన వ్యక్తులపై ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నారా? లేదా ఇతరత్ర చర్యలు చేపట్టనున్నారో దానిపై వేచిచూడాల్సిందే.

# నేరుగా వరివిత్తే విధానంపై రైతులకు అవగాహన



**ప్రజాపక్షం/కూసుమంచి :** మంగళవారం స్థానిక కూసుమంచిలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు నేస్తం కార్యక్రమంలో ప్రొఫసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల ద్వారా నేరుగా వరివిత్తే విధానం గురించి రైతులకు తెలియజేయడం జరిగింది. దమ్ము చేయకుండా పొడి దుక్కిలో సీడ్ డ్రిల్ ద్వారా వరి వేసే పద్ధతి, దమ్ము చేసిన పొలంలో వెదజల్లడం, డ్రమ్ సీడర్ ద్వారా వరి విత్తే విధానాన్ని , ఇలా వేసిన వరిలో కలుపు నియంత్రణ, ఎరువుల యాజమాన్యం గురించి, ఈ విధానం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి, ఈ పద్ధతిలో పాటించవలసిన మెళకువల గురించి తెలియజేశారు. అనంతరం రైతులు తమ సందేహాలను శాస్త్రవేత్తల ద్వారా నివృత్తి చేసుకున్నారు. అనంతరం అశ్వరావుపేట ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు మామిడిలో పండు ఈగ నివారణకు చేపట్టవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు విజయచంద్ర, కూసుమంచి డివిజన్లోని నాలుగు మండలాల ఏవోలు వాణి అరుణకుమారి సీతారాం రెడ్డి, నాగేశ్వరరావు, ఏఈవోలు మరియు రైతులు పాల్గొన్నారు.

# మడుపల్లి బస్తీ దవఖానాలో వైద్యున్ని కొనసాగించాలి



**ప్రజాపక్షం/ మధిర :** అనునిత్యం వందలాది ప్రజలకు ఉపయోగపడే మడుపల్లి బస్తీదవఖానాలో రోగులకు అందుబాటులో ఉండేలా వైద్యుడిని కొనసాగించాలని సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు విన్నవించారు. మంగళవారం ఓపి చూడటానికి వచ్చిన ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ పృధ్వీనాయక్‌ను సిపిఐ బృందం బస్తీదవఖానాలో కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా కొండలరావు మాట్లాడుతూ సుమారు 7వేల జనాభా ఉన్న మడుపల్లి గ్రామానికి ప్రభుత్వం బస్తీదవఖానా మంజూరు చేసిందన్నారు. గతంలో వైద్యులు ఉన్న సమయంలో వైద్య సేవలను ప్రజలు వినియోగించుకున్నారని, ప్రస్తుతం వైద్యులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మడుపల్లి బస్తీదవఖానాకు వైద్యున్ని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు అన్నవరపు సత్యనారాయణ, పొన్నవల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## చెల్లని చెక్కు కేసులో మూడు నెలల జైలు

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** చెల్లని చెక్కు కేసులో నిందితుడైన దొడ్ల లింగయ్యకు ఖమ్మం మొదటి అదనపు ప్రథమ శ్రేణి న్యాయస్థానం న్యాయాధికారి కాసరగడ్డ దీప నిందితునికి మూడు నెలల జైలు శిక్ష, ఫిర్యాదు దారునికి రెండు లక్షలు చెల్లించాలని మంగళవారం తీర్పునిచ్చారు. కేసు పూర్వాపరాలకు వెళితే... ఖమ్మం పట్టణం పాండురంగాపురం కు చెందిన విన్నకోట సంతోష్‌కుమార్ వద్ద యూపిహెచ్ కాలనీకి చెందిన దొడ్ల లింగయ్య వ్యాపార నిమిత్తం 2019 నవంబరు 19న రూ. 1.50 లక్షలు తీసుకుని ప్రాంసరీ నోటు వ్రాయించి ఇచ్చాడు. గడువు సమయంలో ఎన్ని సార్లు అప్పు చెల్లించమని అడిగినా చెల్లించక పోగా రూ. 1.50 లక్షలకు దొడ్ల లింగయ్య చెక్ ఇచ్చారు. చెక్ చెల్లుబాటు కాలేదు. దీనిపై ఫిర్యాదుదారు కేసు దాఖలు చేయగా మంగళవారం న్యాయమూర్తి వాదనలు విని కేసు రుజువు కావడంతో పై విధంగా తీర్పునిచ్చారు.

### సీనియర్ సివిల్ జడ్జిగా చంద్రశేఖర్‌రావు

ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా కెవి చంద్రశేఖర్‌రావు, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగా కల్పనను నియమిస్తూ తెలంగాణ హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా ఉన్న మహ్మద్ అబ్దుల్ జావిద్ పాషాను ఏడవ అడిషనల్ చీఫ్ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ నాంపల్లి హైదరాబాద్‌కు ఖమ్మం అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగా ఉన్న కె. ఆశారాణిని సికింద్రాబాద్ అడిషనల్ చీఫ్ మెట్రో పాలిటన్ జడ్జిగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## వీరయ్యకి నివాళి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం సిరిపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ గ్రామ సర్పంచ్ మట్టూరి వీరయ్య ప్రధమ వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని మట్టూరి వీరయ్య చిత్రపటానికి పలువురు నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాయల నాగేశ్వరరావు, పుచ్చకాయల వీరభద్రం, కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దాసరి దానియేలు, మొక్కా శేఖర్‌గౌడ్, వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరు సీతారాములు, పాలేటి నర్సింహారావు, పొదిల హరినాథ్, సొసైటీ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, కట్ల సంతోష్, పమ్మి అశోక్, బోళ్ళ గంగారావు, మాలోతు మంగీలాల్‌నాయక్, చప్పిడి వెంకటేశ్వరరావు, పల్లపు కొండలు, మూడుముంతల గంగారాజు, బిడికె.రత్నం, పాలకుర్తి నాగేశ్వరరావు, వాడపల్లి రామారావు, ధరావత్ శంకర్,తేజావత్ స్వామి, తోటకూర వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని యజమానుల లైసెన్సులు రద్దు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బస్టాండ్లలో వ్యాపారాలు నిర్వహించే యజమానులు నిబంధనలు పాటించకపోతే లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందని ఖమ్మం రీజినల్ మేనేజర్ సిహెచ్ వెంకన్న తెలిపారు. ఖమ్మం డిపో పరిధిలో గల బస్టాండ్‌లలో వ్యాపారాలు చేసే యజమానులతో రీజినల్ మేనేజర్ వెంకన్న మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్లలో విక్రయించే వస్తువుల నాణ్యత, ఎంఆర్‌పిలపై ప్రయాణికుల నుండి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. నిబంధనలు పాటించని యజమానుల లైసెన్సులను రద్దు చేయడం జరుగుతుందన్నారు. నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. అవసరమైన సూచనలు డిపో మేనేజర్లకు చేశారు. బస్టాండ్లలో అధిక ధరలకు వస్తువులను అమ్మినట్లయితే బస్ స్టేషన్ మేనేజర్‌కు ఫిర్యాదు చేయాలని ప్రయాణికులకు ఆర్ఎం సూచించారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన



**ప్రజాపక్షం/వైరా:** త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో నేపధ్యంలో ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ మంగళవారం వైరా మండలం లోని కెజి సిరిపురం, స్టేజిపినపాక గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో వసతులు ఏర్పాట్లు గురించి సత్యప్రసాద్ పలు సూచనలు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సరఫరా త్రాగునీటి ఏర్పాటు వైద్య సిబ్బంది ఏర్పాటుతో పాటు పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన పలు ఏర్పాట్ల గురించి అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైరా తహశీల్దార్ శ్రీనివాసరావు, మండల అభివృద్ధి అధికారి సరస్వతి, మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు, ఎంపివో జ్యోష్న, పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికలపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/వైరా:** వైరా తహశీల్దార్ శ్రీనివాసరావు త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల నేపద్యంలో మంగళవారం వైరాలో ఐకెపి కార్యాలయం నందు వైరా మున్సిపాలిటీ, వైరా మండలంకు సంబంధించిన డ్వాక్రా గ్రూపులకు ఎన్నికల అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రతి గ్రామంలో ప్రతి వార్డులో 100% ఓటింగ్ నమోదు అయ్యేందుకు కృషి చేయాలని, దానికి సంబంధించి ప్రజల్లో అవగాహన సదస్సును నిర్వహించి చైతన్యపరిచే విధంగా చూడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఏపిఎం శ్యామ్, మెప్మా వెంకటేశ్వరరావుతో పాటు పలువురు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## చేయని తప్పుని ఒప్పుకోమని గిరిజనుడిపై ఒత్తిడి



**ప్రజాపక్షం/కారేపల్లి:** గత వారం రోజుల క్రితం సీతారాంపరంలో జరిగిన బంగారం దొంగతనం కేసుకు సంబంధించి సీతారాంపురం గ్రామంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ చేయడం జరిగింది. ఆ బంగారం దొంగతనం పూనెం శివయ్య, బానోతు రాజేష్, మోకాళ్ళ నర్సయ్య చేశారని అభియోగం కొంతమంది మోపారు. కాని పెద్ద మనుషులు నాడు సీతారాపురంలో పంచాయతీ చేయగా పెద్ద మనుషులు సీతారాంపురంలో పంచాయతీ చేయగా పెద్ద మనుషులు వారిని విచారించగా మేము చేయలేదని చెప్పారు. పెద్ద మనుషులు సాక్షులను విచారించగా వారు చేయలేదు అని దీని వెనుక అగ్రకులానికి చెందిన ఒక వ్యక్తి ఉన్నాడని చెప్పడం జరిగింది. ఆ సమస్య పరిష్కారం అయిందని అనుకొని ముగ్గురు వ్యక్తులు ఇంటికి వెళ్లిపోయారు. రాత్రి ముగ్గురు వ్యక్తులను ఒక ముఖ్య నాయకుడు పిలిచి మీరే దొంతనం చేశామని ఒప్పుకోమని వారిని బెదిరించి ఒప్పుకోవాలని చిత్రహింసలు పెట్టడం అయిన సరే వారు ఒప్పుకోయేసరికి వారిని మమ్మల్ని చంపి అయిన ఒప్పిస్తానని బెదిరించాడు. దీనిపై వారు ఈరోజు వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని గిరిజన సంఘం కోరుతున్నారు.

## బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/ మధిర :** నియోజకవర్గ కేంద్రమైన మధిర నుండి ఆంధ్రా రాష్ట్రం లోని విజయవాడ, నందిగామ తదితర ప్రాంతాలకు నిత్యం వందలాది మంది ప్రయాణిస్తుంటారు.మధిర పట్టణం లోని అంబేద్కర్ సెంటర్‌లో బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణీకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఎండకాలం కావడంతో కనీసం నీడ కూడా లేకుండా రోడ్డు మీదనే ప్రయాణీకులు బస్సులు, ఆటోల కోసం వేచి చూడాల్సి వస్తుంది. అలాగే అంబేద్కర్ సెంటర్‌లో మూడు వైపుల నుండి వాహనాల రద్దీ కారణంగా కూర్చోనే పరిస్థితి లేదని, రోడ్డు వెడల్పు పేరుతో గతంలో ఉన్న బస్ షెల్టర్‌ను కూల్చివేశారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటి వరకు బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణీకులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అంబేద్కర్ సెంటర్‌లో బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేసి ప్రయాణీకులకు ఎటువంటి ఇబ్బందుల లేకుండా చూడాలని ప్రయాణీకులు, స్థానికులు కోరుతున్నారు.

# ఏజెన్సీలో ఆగని గిరిగిరి వ్యాపారాల ఆగడాలు..!



-రోజు కూలీలు, చిరు వ్యాపారాలే టార్గెట్
-రోడ్డున పడుతున్న కుటుంబాలు
-మితిమీరుతున్న
గిరిగిరి, వడ్డీ వ్యాపారుల ఆగడాలు

ప్రజాపక్షం/కరకగూడెం: ఆదివాసీల అవసరాలను ఆసరాగా చేసుకొని ఏజెన్సీలో వడ్డీ వ్యాపారస్థులు మూడు పువ్వులు, ఆరు కాయలుగా తమ వ్యాపారాన్ని యధేచ్ఛగా కొనసాగిస్తున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల అవసరాలకు ఆసరాగా చేసుకొని కొంతమంది బయటి ప్రాంత వ్యాపారస్థులతో పోలిస్తే స్థానిక వడ్డీ వ్యాపారస్థులు కూడా ఏమాత్రం తీసిపోని చందంగా, నెలకు రూ. 1000 కి. రూ. 50 నుంచి రూ. 100 వసూలు చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు లక్ష రూపాయల వారి వద్ద నుండి అప్పు తీసుకుంటే నెలకు వడ్డీ గా ఐదు వేల నుంచి పది వేల రూపాయల వరకు చెల్లించాల్సి వస్తుంది. ఇదేంటని అడిగే అధికారి లేకపోవడంతో అధిక వడ్డీ వసూలు బాధితులకు చూపుతున్నారని, పలుపురు వాపోతున్నారు.

**ఆదివాసి గ్రామాలే వారి టార్గెట్...**

మండలంలో ప్రతి ఏటా లక్షల్లో వడ్డీ వ్యాపారం జరుగుతుందని బాహాటంగా విమర్శలు ఉన్నాయి. సులభ వాయిదా పద్ధతిలో చెల్లించవచ్చు అంటూ ఆశ చూపుతూ మండలంలో ఉన్న ఆదివాసి గ్రామాల్లో తిరుగుతూ డబ్బు ఆశ చూపి అధిక వడ్డీకి వారికి ఇస్తున్నారు. మండలంలో కొందరు దీనినే వృత్తిగా చేసుకొని అప్పులు ఇస్తూ యధేచ్ఛగా తమ దందాలను నిర్వహిస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో కొంతమంది రోజుకు రూ.10 వడ్డీ కూడా చెల్లిస్తున్నారు.

**అధిక వడ్డీ వసూలు చేయటం నేరం....**

కొందరు తమ కుటుంబాల కోసం అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. తీర్చే సమయంలో మాత్రం గొడవలు, దాడులు చోటు చేసుకుంటున్నాయి. ఎందుకు ఇంత వడ్డీ వసూలు చేస్తున్నారని ప్రశ్నిస్తే ఇది వడ్డీ వ్యాపారం ఇలానే ఉంటుంది, మీరు ఒకవేళ చెల్లించకపోతే మీరు ఇచ్చిన ప్రాంశరీ నోటు, ఇతర పత్రాలు మా వద్ద ఉన్నాయంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపణలున్నాయి.



రోజువారి కూలీలు, చిరు వ్యాపారులను సైతం వదలని వడ్డీ వ్యాపారం...

ముందుగా చిరు వ్యాపారస్తుల వద్దకు వచ్చి తాము తక్కువ వడ్డీకే డబ్బులు ఇస్తామని నమ్మబలికి కొన్ని పత్రాలపై సంతకాలు పెట్టించుకొని రూ. 10 వేలు అప్పుగా తీసుకుంటే వారి వద్ద నుంచి ముందుగా రూ. 1000 కట్ చేసుకొని రూ. 9 వేలు బాధితులకు ఇవ్వడం జరుగుతుంది. వారు ఇచ్చే ఐదు రూపాయల పుస్తకానికి వివిధ ఖర్చులు చూపించి 3 వందలు కట్ చేస్తారని సమాచారం. అనంతరం వారు వేసే అధిక వడ్డీలు కట్టలేక అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. తీసుకున్న అప్పుకు వడ్డీ సకాలంలో కట్టకపోతే వ్యాపారస్తులు గొడవలకు దిగటానికి కూడా వెనకాడని పరిస్థితి నెలకొందని తెలుస్తుంది. చిరు వ్యాపారస్తులు వీరి వలలో పడి వడ్డీ అసలు ప్రతివారం కడుతున్న అప్పు తీరటం లేదని, ఇదేంటని ప్రశ్నిస్తే దాడికి దాడిచేయటానికి కూడా వెనుకాడని పరిస్థితిని తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏజెన్సీ ప్రాంతంలో అనుమతులు లేకుండా వడ్డీ వ్యాపారం నిర్వహించే వారిపై చట్టపరమైనచర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గిరి గిరి ఇచ్చేవారు మణుగూరు, పినపాక, పసర, తాడువాయి, కాటాపురం నుండి వచ్చి అమాయక గిరిజనులే వారికి టార్గెట్... అధికారులు ప్రత్యేకంగా నిఘ పెట్టాలని కోరుకుంటున్నారు.

# మహాదేవపురం విద్యార్థులు ప్రతిభ

ప్రజాపక్షం/ మధిర : తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాలలో అడ్మిషన్ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షలో మహాదేవపురం ఎంపిపిఎస్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి సీట్లు సాధించారు. పాఠశాలకు చెందిన నల్లపు జనిత్, కనపర్తి అభినయశ్రీ, మర్సకట్ల రాకేష్, గ్యార లోకేష్‌లు గురుకుల పాఠశాలలో సీట్లు సాధించినట్లు హెచ్ఎం వీరయ్య తెలిపారు. విద్యార్థులను ఆయనతో పాటు ఉపాధ్యాయులు జె.లక్ష్మణ్, బి.కరుణ, ధనసెట్టి భాస్కర్‌రావు, సిహెచ్.రవికుమార్ తదితరులు అభినందించారు.

# ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఓటు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని అదనపు డిఆర్డివో నూరొద్దీన్ తెలిపారు. స్వీప్ కార్యాచరణలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల సమాఖ్య సమావేశాలు ఏర్పా టు చేసి మహిళా సభ్యులకు ఓటు హక్కు విని యోగం, నైతిక ఓటింగ్ పై క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బోనకల్, వైరా, నేలకొండపల్లి, సత్తుపల్లి మండలాల్లో సమావేశాలు నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన చైతన్యం కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివోలు, ఆర్‌పిలు, ఏపిఎంలు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# తన్నీరు ప్రసాద్ సేవలు ప్రశంసనీయం

ప్రజాపక్షం/ ఖమ్మం : విధి నిర్వహణలో మేటిగా నిలిచిన తన్నీరు ప్రసాద్ సేవలు ప్రశంసనీయమని పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు (వెవి) తెలిపారు. ఉద్యోగ జీవితంలో ప్రతి ఒక్కరు పదవి విరమణ చేయక తప్పదని వారు చేసిన సేవలు, పని చేసిన తీరు చిరస్థాయిగా గుర్తుండిపోతాయన్నారు.ముదిగొండ మండలం వల్లభి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తన్నీరు ప్రసాదరావు పదవి విరమణ సభ మంగళవారం పాఠశాలలో జరిగింది. శోభారాణి అధ్యక్షతన జరిగిన సభలో వైవి మాట్లాడుతూ ఉపాధ్యాయులను సమన్వయం చేయడంలోను, బడిఈడు పిల్లలను పాఠశాలకు రప్పించడంలోను ప్రసాదరావు చేసిన కృషి ఆదర్శనీయమన్నారు. ఈ సందర్భంగా ప్రసాదరావును పలువురు సన్మానించారు.ఈ కార్యక్రమంలో గురవయ్య, విజయ్ అమృత్‌కుమార్, ఎన్. కృష్ణమోహన్, సురేష్, శ్రీనివాసరావు, పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేడు నామ నామినేషన్

హాజరు కానున్న
మాజీ మంత్రి హరీష్‌రావు



ప్రజాపక్షం/ ఖమ్మం : బిఆర్‌ఎస్ అభ్యర్థిగా, ప్రస్తుత సిటింగ్ పార్లమెంటు సభ్యుడు నామ నాగేశ్వరరావు బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇప్పటికే తొలిదశ ప్రచారాన్ని పూర్తి చేసిన నామ నామినేషన్ కార్యక్రమానికి ముఖ్యమంత్రిగా మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ నాయకుడు హరీష్‌రావు హాజరు కానున్నారు. హరీష్‌రావు తో పాటు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధు, జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎంఎల్‌ఎలు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు బిఆర్‌ఎస్ నేతలు తెలిపారు.

**రాయల నాగేశ్వరరావు నామినేషన్ ...**



కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించకపోయినప్పటికీ కాంగ్రెస్ నేత రాయల నాగేశ్వరరావు ఉదయం 11 గంటలకు నామినేషన్ వేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థిగా రామసహాయం రఘురాం రెడ్డి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసిన విషయం విధితమే. బుధవారం ఉదయం 11 గంటల లోపు అభ్యర్థి ఎంపిక జరగక పోతే రాయల నాగేశ్వరరావు కూడా నామినేషన్ వేస్తారని సమాచారం.

# పాఠశాల నిర్వహణలో తల్లిదండ్రులే కీలకం



ప్రజాపక్షం/ఖమ్మం : పాఠశాల నిర్వహణలో తల్లిదండ్రులే కీలక పాత్ర పోషిస్తారని వారే అత్యంత కీలకమని వారి సహాయ సహకారాలు లేనిదే పాఠశాల నిర్వహణ సవ్యంగా సాగదని జాకారం పాఠశాల హెచ్ఎం పాషా అన్నారు. మంగళవారం పాఠశాలలో 2023, 24 విద్యా సంవత్సరంలో ఎక్కువ రోజులు పాఠశాలకు హాజరైన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రెండవ తరగతిలో పాయం సాత్విక్, మూడో తరగతిలో పాయం మనోజ, నాలుగో తరగతిలో పాయం సంజయ్, ఐదో తరగతిలో ఎట్టి అస్మితలు పాఠశాలకు ఎక్కువ రోజులు విధిగా హాజరైనట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఆర్థిక పారితోషికంతో పాటు వారి తల్లిదండ్రులను సన్మానించారు. ప్రతి విద్యార్థికి రూ 125 ఆర్థిక పారితోషికం ఇచ్చారు. ఈసందర్భంగా తల్లిదండ్రులను సన్మానించడం ద్వారా గ్రామంలోని ప్రజలకు, విద్యార్థులు తల్లిదండ్రులకు ఒక మార్గదర్శకులాగా ఉంటుందని వారిలో స్ఫూర్తిని నింపి ప్రతి రోజు పాఠశాలకు విద్యార్థులను పంపడానికి హితోధికంగా ఈకార్యక్రమం ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు.

# దేశంలో ఉన్న ఫాసిస్ట్ ప్రమాదాన్ని ఓడించాలి

ప్రజాపక్షం/కారేపల్లి: మార్క్సిస్టు మహోపాధ్యాయులు కామ్రేడ్ లెనిన్ జయంతి సిపిఐ(ఎంఎల్) ఆవిర్భావం సందర్భంగా సింగరేణి మండలం గ్రామంలో మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య అరుణ పతాకాన్ని ఎగరవేసి అనంతరం మాట్లాడుతూ భారతదేశంలో విప్లవ కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి నేటికి 55 ఏళ్ళు నిండుతున్నాయని దాని స్ఫూర్తితో దేశంలో ఉన్న అసమానతలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పదేండ్ల మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు రుణమాఫీలు ప్రకటిస్తూ ప్రజలపై పన్నుల భారాన్ని అధిక ధరల భారాన్ని మోపిందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో మరోసారి గెలుపొందడం కోసం మతోన్మాద బిజెపి పార్టీ రాజ్యాంగ సంస్థలను తమ జేబు సంస్థగా వాడుకుంటుందన్నారు. సిబిఐ ఈడి ఎన్ఐఏ లాంటి సంస్థలను ఉద్యమకారులు, ప్రతిపక్ష నాయకులపై ప్రయోగించి అక్రమ అరెస్టులను చేస్తుందన్నారు. ప్రజలపై విప్లవోద్యమంపై దుర్మార్గమైన నిర్బంధాన్ని ప్రయోగించి అణిచివేయాలనుకుంటుందని అన్నారు. వేల కోట్ల రూపాయలను ఎలక్ట్రోరల్ బాండ్ల పేరుతో దోచుకుందన్నారు. గిట్టుబాటు ధర అడిగినందుకు ఢిల్లీలో రైతాంగంపై కాల్పులు జరిపి చంపివేసిందన్నారు. ప్రజా ఉద్యమాలే దేశంలో ఫాసిస్ట్ ప్రమాదాని ఓడింగలవన్నారు. దేశాన్ని గంప




గుత్తాగా కార్పొరేట్లకు తాకట్టు పెట్టిన బిజెపి పార్టీని పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ సింగరేణి, కామేపల్లి సంయుక్త మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, సర్పంచ్ స్వర్ణపాక అనసూర్య, మండల నాయకులు బిక్షసాని భాస్కర్, గుమ్మడి సరోజిని, కనకరాజు, ఎర్రయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



ప్రజాపక్షం/ఖమ్మం : హనుమాన్ జయంతి వేడుకలను ఆళ్లపల్లి మండల కేంద్రంలోని శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం బైక్ ర్యాలీ చేశారు. బైక్ ర్యాలీ ఆళ్లపల్లి మండల కేంద్రంలోని అన్ని పురవీధులలో నిర్వహించి శ్రీ సీతారామచంద్ర ఆలయంకు చేరుకున్నారు. అక్కడ పూజలు నిర్వహించి భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ర్యాలీలో శ్రీరామ జయరామ జయజయరామ అంటూ శ్రీరామ నామ స్మరణతో ఆళ్లపల్లి మండల కేంద్రం మారుమోగింది. ఈ కార్యక్రమంలో గొరిసెట్టి శ్రీనివాసరావు, అనమోల వెంకటేశ్వరరావు, సంక ప్రభాకర్, సిరినోముల వజ్రేశ్వరరావు, తెలగాని శ్రీనివాసరావు, బుర్ర వెంకన్న, తులం ముత్తిలింగం, గుండెబోయిన రామకృష్ణ, గణేష్, సందీప్, నవీన్, భిక్షం, వెంకటేశ్వర్లు, నాగరాజు, రామకృష్ణ, నరేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.